క్లుప్తంగా

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఆదోని రూరల్: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జనార్దన్ శుక్రవారం తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, అనుబంధ శాఖల్లో భాగంగా ఆదోని మండలంలోని 40 గ్రామ పంచాయతీల్లో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీలు పూర్తి చేసిందన్నారు. సామాజిక తనిఖీ బృందం గుర్తించిన అంశాలపై ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు ప్రజావేదికలో విచారించి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటారన్నారు.

19న నూతన రజక ఉపాధ్యాయులకు సన్మానం


మాట్లాడుతున్న రజక సంఘం ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: డీఎస్సీ-2025లో ఎంపికైన రజక ఉపాధ్యాయులకు ఈనెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు నేషనల్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ (హౌసింగ్ బోర్డు కాలనీ)లో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రజక సంఘం నాయకులు, ఉపాధ్యాయులు నాగరాజు, గోవిందప్ప తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మరాటీగేరిలోని రజక విశ్రాంతి భవనంలో ఆదోని తాలూకా రజక ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఎంతో మంది రజక నిరుద్యోగులు అహర్నిశలు కష్టపడి ప్రతిభ కనబరిచి ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని, వారిని సంఘం తరపున సన్మానిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్ విరాళం


ఫర్నిచర్‌తో పూర్వపు విద్యార్థులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: చిన్నపెండేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.82 వేల విలువ చేసే ఫర్నిచర్‌ను శుక్రవారం విరాళంగా అందించారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం శేకన్న, ఉపాధ్యాయ బృందం భాస్కర్, శ్రీనివాసులు, శిరీష, హనుమన్న అభినందించారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వపు విద్యార్థులు సహకారం అందించం సంతోషంగా ఉందని హెచ్‌ఎం అన్నారు.

పేదరిక నిర్మూలనకు కృషి


మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నామని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్‌లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి అన్నారు. పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేదలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ పిల్లలను పనులకు పంపకుండా తప్పక చదివించుకోవాలని సూచించారు. అనంతరం ఎనిమిది కుట్టు మిషన్లను మహిళలకు అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి వనపరాజు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు, క్లబ్ విశిష్ట సభ్యులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు

ఎమ్మిగనూరుటౌన్: సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయ ఆవరణలో సంఘ నాయకుడు రంగన్న గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమగ్ర శిక్ష ఎంఆర్సీ, సీఆర్‌ఎంటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 ఏళ్ల నుంచి విద్యా శాఖలో పలు రకాల సేవలు అందిస్తున్నా వారికి సమాన పనికి సమాన వేతనాన్ని ప్రభుత్వం చెల్లించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో బి.దుర్గన్న, ఇమ్రాన్, పుష్పావతి, భారతి, ప్రియాంక, ప్రతాప్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ అడ్డుకుంటాం

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించే కుట్రను అడ్డుకుంటామని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, ఆ వార్డు కౌన్సిలర్, పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజరత్నం అన్నారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా పట్టణంలోని 9వ వార్డులో శుక్రవారం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను నిర్మిస్తే వాటిని ప్రైవేట్‌కు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బుట్టారేణుక ఆధ్వర్యంలో పార్టీ అనుబంధ కమిటీలతో కలసి కోటి సంతకాల సేకరణ ద్వారా కూటమి కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ప్రజలను చైతన్య పరిచి ఉద్యమాలతో ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని, ఈ మేరకు కూటమి ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ సుధాకర్, ఎస్సీ సెల్ జిల్లాకార్యవర్గ సభ్యులు గుమ్మల చిన్న, వార్డు నాయకులు టీకే గౌస్, గౌరమ్మ, టీకే హజరత్, అల్లబకాష్, జిలాన్, ఫకృద్దీన్, నిరంజన్, పెద్దయ్య, ప్రసాద్, రజ్జాక్, కటిక షరీఫ్, సోషల్ మీడియా సభ్యులు ఎన్‌ఎండీ షరీఫ్, కదిరికోట రాజ్ కుమార్, జస్వంత్, దితరులు పాల్గొన్నారు.


రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప

ఆర్థిక సహాయం

కౌతాళం: కరణి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త లక్ష్మన్న భార్య గొల్ల మారెమ్మ మృతి చెందడంతో మట్టి ఖర్చులకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి రూ.5వేలు ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గ్రామ సర్పంచ్ పుష్పలత, వైఎస్సార్ సీపీ నాయకులు గోవిందులు లక్ష్మన్న కుటుంబానికి సంతాపాన్ని తెలిపి, ఎమ్మెల్యే అండగా ఉంటారని భరోసా కల్పించారు.

సేవలతోనే గుర్తింపు

ఎమ్మిగనూరు టౌన్: సామాజిక సేవలందించే వారికి గుర్తింపు లభిస్తుందని స్థానిక రిక్రియేషన్ క్లబ్ సభ్యు లు పేర్కొన్నారు. స్థానికుడైన బైలుప్పుల షఫీవుల్లా గౌరవ డాక్టరేట్ పొందడంతో ఆయనను శుక్రవారం స్థానిక రిక్రియేషన్ క్లబ్‌లో సభ్యులు ఎం.హరినారాయణరెడ్డి, కార్మంచి ఈరన్నగౌడ్, యుకె ఈరన్న, వెంకటరంగారెడ్డి, రామాంజినేయులుతో పాటు తదితరులు ఘనంగా సత్కరించి అభినందించారు.

మా ఊరు రోడ్డును బాగు చేయండి



కంబళదిన్నెలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: కంబళదిన్నె నుంచి ఎమ్మిగనూరు వరకు అధ్వానంగా మారిన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఐ ఆధ్వర్యంలో గ్రామస్తులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్ మాట్లాడుతూ.. ఎమ్మిగనూరు - మాలపల్లి ప్రధాన రహదారిలో కంబళదిన్నె గ్రామం వరకు మొత్తం గుంతలు ఏర్పడి జనం నడవలేని దుస్థితికి చేరుకుందన్నారు. ఈ రహదారిలో ప్రయాణం చేయాలంటేనే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు రహదారులు నిర్మిస్తామని హామీలు ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు పనుల్లో పర్సెంటేజీల కోసం పాకులాడుతున్నారనే కానీ ప్రజల సమస్యలు పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమ్మరి చంద్ర, తిక్కన్న, నాగరాజు, రాము, బడేసా, హుసేన్‌సాబ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఆదోని రూరల్: ప్రభుత్వ రంగంలో ఔట్ సోర్సింగ్, అసంఘటిత కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, రామాంజనేయులు, మండల కార్యదర్శి వీరారెడ్డి, సీఐటీయూ పట్టణ కార్యదర్శి తిప్పన్న డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సీఐటీయూ మండల 3వ మహాసభలను సీఐటీయూ మండలాధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 16 నెలలు గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకపోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమన్నారు. ఇప్పటి వరకు ప్రజలు, కార్మికుల సమస్యలను పరిష్కారం చేయలేదన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్ష కార్యదర్శులుగా రామాంజనేయులు, వీరారెడ్డిని ఏక గ్రీవంగా ఎన్నుకున్నా రు. అలాగే కమిటీ సభ్యులుగా సోమక్క, వరలక్ష్మి, తిక్కప్ప, అల్లప్ప, అయ్యన్న, లక్ష్మన్న, ముస్తఫా, అనీఫ్, సుకన్య, లావణ్య, రాజేశ్వరి, లత, శేఖర్, చిరంజీవిలను ఎన్నుకున్నారు.

గవాయ్‌పై దాడి నిందితుడిని శిక్షించాలి


కోసిగి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


ఆదోని తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కోసిగి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషన్ రామకృష్ణ గవాయ్‌పై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని మంత్రాలయం నియోజవర్గ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ బండారు హనుమంతు, కో కన్వీనర్ ముగతి ప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం కోసిగిలో నడిమి పాళ్యెం వద్ద రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి నల్లబాడ్జీలు ధరించి ఆర్టీసీ బస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం దారుణంగా ఉందన్నారు. దేశంలో దళితుల పట్ల రక్షణ లేకుండా పోయిందన్నారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్‌ఐ శ్రీరాములకు అందజేశారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు సల్మాన్‌రాజు, దేవన్న, జయన్న, చిదానంద, కృష్ణ, ఎంపీటీసీ సభ్యులు రాజు, ఏఐవైఎఫ్ నాయకులు రాజు, ప్రకాష్, కర్రెప్ప, సామేల్, జీవన్, మారేష్, నరసప్ప, ముక్రయ్య, రవిరాజు, ప్రకాష్, దేవదాసు, అబ్రహాంలు పాల్గొన్నారు.

కౌతాళం: సీజేఐ డాక్టర్ గవాయ్‌పై జరిగిన దాడిపై విచారణ జరపాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆనంద్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో చిన్న, రేవణ్ణ, రాజబాబు, శంకరప్ప, రాంబాబు, మారెప్ప, ప్రకాశ్, తిమోతి, నాగరాజు పలువురు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: సీజేఐపై దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, జిల్లా ఇన్‌చార్జ్ దుమ్ము వెంకటేశ్వర్లు చిన్న మాదిగ, ఆదోని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పి.మనోజ్ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణం నుంచి ర్యాలీగా ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు గుమ్ముల బాలస్వామి మాదిగ, మాదాస్ జగన్, ఎం.కిరణ్, నరసింహులు మాదిగ, తిమ్మన్న, శాంతరాజ్, వన్నెల మణికంత, ఈరన్న, సురేంద్ర, నారాయణ, సుధాకర్, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

నందవరం: భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యాక్షుడు బండారి ప్రకాశం డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ , ఎంఈఎఫ్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆ సంఘాల నాయకులు పాత కెనరా బ్యాంకు నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు అజయ్, రాజేష్, దేవపాల్, చిన్నరాజు, ముక్కరన్న, మునిస్వామి పాల్గొన్నారు.

రాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి


శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీ కృష్ణ దేవరాయల జయంతి, పట్టాభిషేక మహోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నగర బలిజ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మన్న, రవికుమార్ కోరారు. శుక్రవారం రాయల 496వ వర్ధంతి సందర్భంగా సంఘం నేతలు ఆయన విగ్రహానికి గజమాలను వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలువలు తవ్వించి, దేవాలయాలు నిర్మించి తెలుగు నేలపై రాయలు విశేషమైన కార్యక్రమాలను చేపట్టారన్నారు. అలాగే తెలుగు భాష వైభవాన్ని పెంపొందించారని కొనియాడారు. నగరంలో అర్థాంతరంగా నిలిచిపోయిన కాపు భవన్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. కాపు కార్పొరేషన్‌కు తగినన్ని నిధులు విడుదల చేయాలన్నారు. కాపు నాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్జా రామక్రిష్ణ, ప్రధాన సలహాదారు సింగంశెట్టి సోమశేఖర్, ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌కుమార్, కార్యవర్గ సభ్యులు ఓంకార్, ఆంజనేయులు, శ్రీనివాసులు, శోభన్‌బాబు, వెంకటేశ్వర్లు, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో వసతులు కల్పించండి


విద్యార్థినుల సమస్యలు తెలుసుకుంటున్న దృశ్యం

కౌతాళం: కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్‌ఎఫ్ మండల మహిళ కన్వీనర్లు లత, మానస, నాగరత్న, సంగీత అన్నారు. కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులు పలు సమస్యలతో బాధపడుతున్నట్లు తమ దృష్టికి రావడంతో తమ సంఘం సభ్యులతో కలిసి శుక్రవారం పాఠశాలకు వెళ్లి విద్యార్థినుల సమస్యలను తెలుసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థినులకు వాష్‌రూం, టాయిలెట్లలో నీళ్ల లేక నిరుపయోగంగా ఉండడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. భోజనంలో నాణ్యత లేదని, సురక్షిత నీరు అందించడం లేదని, అధికారులు దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. వారి వెంట ఏఐఎస్‌ఎఫ్ నాయకులు మండల అధ్యక్ష, కార్యదర్శులు అనుమేష్, సాయివర్మ, జిల్లా కార్యవర్గ సభ్యుడు గురు, బసవరాజు ఉన్నారు.

ఆసుపత్రి అధికారులు పొట్ట కొడుతున్నారు


లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అధికారులు తమ పొట్టకొడుతున్నారని లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆసుపత్రిలో సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు, హమాలీ యూనియన్ సెక్రటరీ నాగరాజు మాట్లాడుతూ.. కర్నూలు నగర పరిధిలోని బుధవారపేట ప్రాంతంలో నివాసముండి గత 30 ఏళ్లుగా కార్మిక శాఖ కార్యాలయంలో యూనియన్‌గా రిజిస్టర్ చేసుకుని లోడింగ్, అన్‌లోడింగ్ పనుల ద్వారా ఉపాధి పొందుతున్నామని వివరించారు. కర్నూలు మ్యూజియం నుంచి హంద్రీ బ్రిడ్జి, కేసీ కెనాల్, వినాయక టెంపుల్ వరకు, బుధవారపేట నుంచి లక్ష్మీ గార్డెన్ వరకు హమాలీ పని చేసుకుంటూ 60 మంది కార్మికులు కుటుంబాలను పోషించుకుంటున్నారని చెప్పారు. ఇటీవల ఆసుపత్రి అధికారులు వస్తువులు, మెటీరియల్ వస్తే తమకు చెప్పకుండా అక్కడ క్లీనింగ్ కోసం ఏర్పాటు చేసుకున్న శానిటేషన్ వర్కర్స్‌ను భయపెట్టి లోడింగ్, అన్‌లోడింగ్ పని చేయించుకుంటూ తమ కడుపు కొడుతున్నారని విమర్శించారు. ప్రధాన మంత్రి సూపర్ జీఎస్టీ సభకు వస్తువులు లారీల ద్వారా వస్తే వాటిని పోలీసుల సమక్షంలో శానిటేషన్ వర్కర్స్‌తో అన్‌లోడింగ్ చేయించారన్నారు. దీని వల్ల తాము ఉపాధి కోల్పోయి నష్టపోయామన్నారు.

సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పత్తికొండ సీజనల్ వ్యాధులపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, అలా కాకుండా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వైద్యశాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ రామనాథ్‌రావు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను జిల్లా మలేరియా యూనిట్ అధికారి నూకరాజుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఇటీవల నమోదైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులపై స్థానిక వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి జ్వరాలతో బాధపడుతూ వచ్చే ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు చేయాలని సూచించారు. కిందిస్థాయి సిబ్బంది కాలనీల్లో పర్యటించి ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలను వివరించాలని చెప్పారు. అనంతరం మెడికల్ ల్యాబ్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం


నందవరంలో తాహెర్‌బాషాను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, రాజీవ్‌రెడ్డి

● మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి

నందవరం: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ ధైర్యంగా ఉండాలని.. పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి కార్యకర్త వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ధైర్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ఎవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారిస్తామని వివరించారు. కూటమి నాయకులు ఇబ్బందులు పడితే ధైర్యంగా ఎదుర్కోవాలని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారన్నారు. కార్యకర్తలు, నాయకులపై దాడులకు పాల్పడి తే డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని సూచించారు.

పరామర్శ..

రోడ్డు ప్రమాదంలో గాయపడిన నందవరం 11వ వార్డు మెంబర్, వైఎస్సార్‌సీపీ నాయకులు చాంద్ తాత కుమారుడు తాహెర్‌బాషాను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి, వైఎస్సార్ సీపీ యువ నాయకుడు ఎర్రకోట రాజీవ్ రెడ్డితో కలిసి పరామర్శించారు. చికిత్స పొందిన తీరు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి గద్దం నారాయణ రెడ్డి, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు చుక్క మల్లేష్, లింగమూర్తి, వంటేద్దుల మల్లేష్, బసవరాజు గౌడ్, రంగముని, పంపయ్య, బుజ్జిబాబు, సోమశంకరరెడ్డి, రాజా రెడ్డి, రాఘవరెడ్డి, సర్పంచ్ శివన్న, వెంకట్రామిరెడ్డి, శాంతిరాజ్, దానం, వర్దరాజు, ఆదాము పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనతో ఒరిగిందేమీ లేదు

ఎమ్మిగనూరుటౌన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కర్నూలు పర్యటనతో ప్రజలకు ఒరిగిందేమి లేదని సీపీఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి గోవిందు విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆపార్టీ నాయకులు రమేష్, అబ్దుల్లా, రాజు, తిమ్మప్పలతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతం కరువు కాటకాలతో ఇబ్బందులు పడుతున్నా కూటమి నేతలు ప్రధాని దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమ జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీపై పీఎం స్పందించక పోవడం దారుణమన్నారు. పేరుకు మాత్రం జీఎస్టీ తగ్గింపు సభ అని చెప్పినా కూటమి నేతలు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారాలోకేష్‌లు ప్రధాని మోడిని పొగిడేందుకే సభ నిర్వహించినట్లు కనిపించిందని విమర్శించారు. జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఒనగూరిన లాభం ఏమి లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరును ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తప్పకుండా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

● పత్రికా స్వేచ్ఛపై దాడి అమానుషం



సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి, నెల్లూరు జిల్లా సాక్షి విలేకరులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులను ఖండిస్తూ ఎమ్మిగనూరు పట్టణంలో ఏపీడబ్ల్యూజే, ఏపీడబ్ల్యూజేఎఫ్, జాప్ జర్నలిస్టు సంఘాల నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. పత్రికా స్వేచ్ఛపై దాడి అమానుషమని, జర్నలిస్టులపై వెంటనే కేసులు ఉపసంహరించుకోవాలన్నారు. ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రగౌడ్‌కు వినతి పత్రం అందజేశారు.

– ఎమ్మిగనూరుటౌన్

పరీక్షల విభాగాన్ని ప్రక్షాళన చేయాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరీక్షల విభాగాన్ని ప్రక్షాళన చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం వర్సిటీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్సిటీ పరీక్షల విభాగం నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అనేకమార్లు ప్రశ్నా పత్రాలు లీక్ అయినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు.పెండింగ్‌లో ఉన్న అవినీతి నివేదికలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షల విభాగాన్ని భ్రష్టు పట్టిస్తూ అవినీతికి పాల్పడుతున్న పరీక్షల విభాగం అధికారిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. పరీక్షల విభాగాన్ని ప్రక్షాళన చేయకపోతే దశలవారీ ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. నాయకులు సందీప్ నాయక్, ఓబులేష్, కిరణ్, తేజ, కరుణాకర్, గణేష్, దాసు, ప్రశాంత్, కృపాకర్ పాల్గొన్నారు.

కంపు.. కంపు!



పట్టణంలోని బార్‌పేట కాలనీలో సామూహిక మరుగుదొడ్ల ఆవరణం అపరిశుభ్రంగా మారింది. మురుగు నీరు నిలిచి పందులు, కుక్కలకు ఆవాసంగా మారుతోంది. దీంతో రాత్రిపూట దోమలు స్వైర విహారం చేస్తుండటంతో కాలనీ వాసులు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. స్వచ్ఛ దివాస్ అంటూ హడావుడి చేసే అధికారులు ఇలాంటి చోట్ల ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కాలనీ వాసులు విమర్శిస్తున్నారు.

– ఆదోని సెంట్రల్